## అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగేంద్ర చౌదరికి మాతృ వియోగం

**జగ్గంపేట, పెన్ పవర్, మే 6:** జగ్గంపేటకు చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవా తత్పరులు, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి మాతృమూర్తి పాలచర్ల అనంతలక్ష్మి బుధవారం ఉదయం శివైక్యం చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అనంతలక్ష్మి నిరాడంబర జీవితం గడుపుతూ కుటుంబానికి ఆదర్శంగా నిలిచారు. ఆమె మృతి పాలచర్ల కుటుంబానికి తీరని లోటు అని కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# లకాకినాడ జీజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు





- వైద్య సేవల్లో గణనీయ పురోగతి
- మంత్రి సత్యకుమార్ యాదవ్

**కాకినాడ, పెన్ పవర్,మే 6:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, వైద్య సేవల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆసుపత్రిలోని ఈఎన్టీ బ్లాక్‌లో డీ–అడిక్షన్ వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం క్లినికల్ లాబొరేటరీలోని ఎస్‌పీఎం బ్లాక్‌లో వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో తీసుకువస్తున్న మార్పులు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. గతంతో పోలిస్తే ఓపీ సేవలు సుమారు 26 వేల మేర పెరిగాయని, మేజర్ శస్త్రచికిత్సలు 300, మైనర్ శస్త్రచికిత్సలు 4 వేల మేర పెరిగాయని వెల్లడించారు. ముఖ్యంగా డయాగ్నస్టిక్ పరీక్షలు 8.67 లక్షల నుంచి 20.68 లక్షలకు పెరగడం వైద్య సిబ్బంది కృషికినిదర్శనమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వైద్య సిబ్బంది నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొంటూ,కాకినాడకు 46 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను నియమించామని తెలిపారు. 2027 నాటికి ఖాళీ పోస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రాబోయే రోజుల్లో 'సంజీవిని' డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు, 104 సేవల ద్వారా ఇంటి వద్దకే 47 రకాల పరీక్షలు అందించనున్నట్లు తెలిపారు. క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఉచిత పరీక్షలు, రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రూ.35 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసినట్లు, రోగుల రద్దీ తగ్గించేందుకు కొత్త భవనాల నిర్మాణం చేపడతామని చెప్పారు.ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ఆసుపత్రిని రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మౌలిక సదుపాయాల విస్తరణ, ఓపీ రద్దీ తగ్గించే చర్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం,ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డీఎంహెచ్ఓ డా. జె. నరసింహ నాయక్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. శ్రీనివాసన్,ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



## పదవ తరగతిలో 570 మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పారితోషకాలు

- రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు



**జగ్గంపేట, పెన్ పవర్, మే 6:** ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 570 నుంచి ఆపైన మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఉపకార వేతనాలు అందిస్తున్నామని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) బుధవారం మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొండబాబు తెలిపారు. ఈనెల 17వ తేదీలోగా గూగుల్ ఫారం ద్వారా విద్యార్థులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. గూగుల్ లింక్ కోసం మమ్మల్ని సంప్రదించాలన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సారధ్యంలో ఆర్యవైశ్యులను అన్ని విధాల ఆదుకుంటున్నారని సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పెద్దనాపల్లి లో శ్రీ వీరాజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 6:** మండల పరిధి పెద్దనాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరాజనేయ స్వామి ఆలయం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోత్సరణల మధ్య శాస్త్రోక్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలోకాకినాడ జిల్లా ఎంపీపీ సమాఖ్య అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు పాల్గొని శ్రీ వీరాజనేయ స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలువురు కూటమి పార్టీ శ్రేణులు, భక్తులు గ్రామ ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం -- అనాధ యువతికి ఆదర్శ వివాహం

**రావులపాలెం/కొత్తపేట,పెన్ పవర్, మే 6:**
సమాజంలో కట్నాల పేరుతో వివాహాలు భారంగా మారుతున్న ఈ రోజుల్లో, మానవత్వాన్ని చాటుతూ ఒక యువకుడు అనాధ యువతిని వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచాడు. రావులపాలెంలోని లిటిల్ ఫ్లవర్ వెల్ఫేర్ సొసైటీ శక్తి సదన్ (సురక్షిత హోమ్)లో గత 9 సంవత్సరాలుగా నివసిస్తున్న సుంకర కృష్ణవేణి అనే యువతి అనాధగా జీవనం సాగిస్తోంది.

హోమ్‌లో ఉంటూ చదువుతో పాటు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి చేతివృత్తుల్లో నైపుణ్యం సంపాదించి, స్వయం ఆధారంగా నిలబడేందుకు కృషి చేసింది. ఈ నేపథ్యంలో కొవ్వూరు గ్రామానికి చెందిన పెండం రాజేష్ కుల, మతాలకు అతీతంగా ఆమెను వివాహం చేసుకోవడానికి ముందుకొచ్చాడు.

తన కుటుంబ సభ్యులతో కలిసి హోమ్ డైరెక్టర్ సిస్టర్ సంగీత, సిస్టర్ ఆరోగ్య మేరీలతో మాట్లాడగా, యువకుడి వ్యక్తిత్వాన్ని పరిశీలించిన అనంతరం సిస్టర్ సంగీత వివాహానికి అంగీకరించారు. ఇరువురి సమ్మతితో ఐసిడిఎస్ విభాగానికి సమాచారం ఇచ్చి, బుధవారం హిందూ సాంప్రదాయం ప్రకారం సురక్షిత హోమ్‌లో వివాహాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఐసిడిఎస్ పీడీ నాగమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిస్టర్ సంగీత మాట్లాడుతూ హోమ్ స్థాపించి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని, కృష్ణవేణి 9 సంవత్సరాలుగా ఇక్కడ ఉంటూ స్వయం ఆధారంగా ఎదిగిందని తెలిపారు.

ఈ ఆదర్శ వివాహాన్ని పలువురు అధికారులు, పారా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ థామస్,ల్యాంప్ సంస్థ అద్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ స్థానిక ప్రజలు ప్రశంసించారు.





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు





కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,మే 6:** ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో మే 21 నుంచి జూన్ 4 వరకు నిర్వహించనున్న పరీక్షలపై డీఆర్వో డా. టి. తిప్పేనాయక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు, రెవెన్యూ,పోలీస్,విద్యుత్, వైద్య ఆరోగ్యం,ప్రజారవాణా,తపాలా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 40 పరీక్షా కేంద్రాల్లో 24,072 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పోలీస్, తపాలా శాఖలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్థులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య శాఖ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఆర్టీసీ బస్సులు నడపాలని,పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఐఈవో వి.కేశవరావు, వివిధ శాఖల అధికారులు,జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు జె.రాంబాబు,వి. శ్రీనివాసరావు,డి.వి.కె. వర్మ, అధ్యాపకులు ఎన్. గోవింద తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన శిక్షణ

- ఆత్రేయపురం ఎంపీడీవో బి కె ఎస్ ఎస్ వెంకట రామన్





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 6:**ప్లాస్టిక్ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వర్గీకరణ, సేకరణ, రీసైక్లింగ్ విధానాలు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ తగ్గింపు చర్యలపై వివరంగా అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కాజులూరులో విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి



**కాజులూరు, పెన్ పవర్ మే 6:** కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత తరగతులకు వెళ్తున్న సుమారు 610 మంది విద్యార్థులను కొత్తగా నమోదు చేసేందుకు ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్లు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పదో తరగతిలో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులను ఉత్తీర్ణులుగా చేయడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సమర్థంగా పర్యవేక్షించాలని సూచించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి--2 జాన్, సి.ఆర్.పీలు, ఐసీడీఎస్ సిబ్బంది, మండలంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్కు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్, కాకినాడ వారి ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య కంటే కనీసం 10 మందిని అదనంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్య క్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీచైతన్య విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు వెల్లువ



**రావులపాలెం, పెన్ పవర్ మే 6:**పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ వి. మహేష్ కుమార్ అభినందించారు. కలెక్టరేట్లో విద్యార్థులు, అధ్యాపక బృందం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కులతో పాటు పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా లోకజ్ఞానం, విలువలు, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం కూడా విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, సమయపాలనతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థలు 2026 ఫలితాల్లో విశిష్ట విజయాలు నమోదు చేయడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో సివిల్స్, మెడిసిన్, ఇంజినీరింగ్, సైన్స్, టెక్నాలజీ వంటి రంగాల్లో కోనసీమ జిల్లా విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మండలంలో ప్రథమ స్థానం సాధించిన గ్రంధి సాత్విక్ను పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించి అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేష్, ప్రిన్సిపాల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలను సందర్శించిన ఉగాండా రాజదంపతులు





- విద్యా ఒప్పందం

**కాకినాడ, పెన్ పవర్,మే 6:** లక్ష్మీనారాయణ నగర్లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలను ఉగాండా రాజదంపతులు మరియు విద్యా ప్రతినిధులు బుధవారం సందర్శించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలిపారు.కళాశాలలో అందిస్తున్న కోర్సులు, విద్యా ప్రమాణాలపై చర్చించి ఉగాండా దేశ విద్యార్థులను ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో చేర్పించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా ఉగాండా రాజదంపతులు హెచ్ఆర్హెచ్ పాల్ సండే ఎమోలోట్ ఎటోమెయిలెంగ్ ఎమోరిమోర్ పాపా ఇటెసో ×× మరియు హెచ్ఆర్హెచ్ జూలియట్ ఎమోలోట్, టెసో కింగ్డమ్ క్వీన్ కళాశాలను సందర్శించారు. వీరితో పాటు ఇటెసో కల్చరల్ యూనియన్ విద్యా, క్రీడల మంత్రి ఒబిలాన్ అబుబకర్ ఉమర్, విద్యా సంచాలకులు అగుటి జామ్, సొరోటి విశ్వవిద్యాలయం అకడమిక్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఒకెల్లో గ్రెగొరీ జేమ్స్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కబ్విగు శామ్యూల్,గులు విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ జోసెఫ్ ఓపుల్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఉగాండా విద్యార్థులకు ఆదిత్య విద్యాసంస్థల్లో చదివే అవకాశం కలగడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలోని సదుపాయాలు, కోర్సులు, బోధన విధానాలు, సాధించిన విజయాలను వివరించారు.అనంతరం రాజదంపతులు కళాశాల గ్రంథాలయం, ప్రయోగశాలలు, ఏఐ మరియు కంప్యూటర్ ల్యాబ్లు, ఫిషరీస్ మరియు ఆక్వాకల్చర్ ల్యాబ్లను పరిశీలించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ ఉగాండా ప్రతినిధులు కళాశాల సదుపాయాలను ప్రశంసించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విదేశీ విద్యార్థుల సంచాలకులు జాఫర్, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా జనగణనకు జిల్లావాసుల పూర్తి సహకారం అవసరం-కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, పెన్ పవర్,మే 6:** జిల్లాలో జరుగుతున్న ఇంటింటా జనగణన కార్యక్రమానికి జిల్లావాసులు పూర్తి సహకారం అందించి భవిష్యత్తు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు.బుధవారం కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్,జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మే 1 నుంచి 30 వరకు ఇంటింటా జనగణన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే చాలామంది స్వీయ గణన ద్వారా తమ వివరాలు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు.ఎన్యూమరేటర్లు ప్రతి గృహాన్ని సందర్శించి ఇంటి వసతులు, కుటుంబ వివరాలను యాప్లో నమోదు చేస్తారని వివరించారు.జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల మంది ఎన్యూమరేటర్లు,658 మంది సూపర్వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.ప్రజలు తమ పూర్తి వివరాలను స్పష్టంగా అందించి సహకరించాలని కోరారు. ప్రజలు సమగ్రంగా సమాచారం అందించడం ద్వారా భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించడానికి ఇది దోహదపడుతుందని కలెక్టర్ చెప్పారు. జనగణన ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


## వర్షాలతో తడిసిన ధాన్యం... రైతులకు నష్టాలు




- దళారీల దోపిడీపై ఆందోళన

**కాజులూరు, పెన్ పవర్,మే 6:** కాకినాడ జిల్లా కాజులూరు మండలంలో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షాల కారణంగా తడిసి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వల్లు రాజబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాజులూరు మండలంలోని శీలలంక, కాజులూరు, చేదువాడ, శీల గ్రామాల్లో పర్యటించి తడిసిన ధాన్యం రాశులు, ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ నాలుగు రోజులు ఆరబెట్టినా ధాన్యం పూర్తిగా ఆరలేదని, మళ్లీ కురిసిన వర్షాలతో ఆరిన ధాన్యం కూడా తడిసిపోయిందని వాపోయారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలేదని,తూకం వేయడంలేదని తెలిపారు. కేలి ఉందని, ఇతర కారణాలు చూపుతూ ధాన్యం ధరలను తగ్గిస్తున్నారని ఆరోపించారు. దీంతో మధ్య దళారులు,మిల్లర్లకు ఇది అవకాశంగా మారిందని రాజబాబు అన్నారు.ప్రభుత్వం వెంటనే కాటా,జట్టు ట్రాక్టర్లు సమకూర్చాలని,మండల స్థాయి అధికారులు రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం రాకుండా ప్రభుత్వం స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సలాది వీరాస్వామి,కాజులూరు మండల కౌలు రైతులు పాల్గొన్నారు.

## వాడపల్లి దేవస్థానం అభివృద్ధిపై టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు తో భేటీ







**ఆత్రేయపురం పెన్ పవర్ మే 6:**వాడపల్లి దేవస్థానం సమగ్రాభివృద్ధి కార్యక్రమాల సాధనలో భాగంగా, పరిపాలనా స్థాయిలో కీలకమైన చర్చలు జరిపేందుకు దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తో కలిసి బుధవారం తిరుపతిలో టీటీడీ దేవస్థానం చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయుడు) మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సమావేశం సందర్భంగా దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలు, ముఖ్యంగా భక్తులకు మెరుగైన సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతుల ఆధునీకరణ, ఆధ్యాత్మిక పర్యాటకాభివృద్ధి వంటి కీలక అంశాలపై విశదీకృతంగా చర్చలు జరిగినట్లు సమాచారం.వాడపల్లి దేవస్థానాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పలు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది.టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత మేర సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చినట్లు వర్గాలు పేర్కొన్నాయి। ఈ భేటీ వాడపల్లి దేవస్థానం భవిష్యత్ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు।

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**జగ్గంపేట, పెన్ పవర్, మే 6**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరంకు సంబంధించి వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు తెలిపారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్గదర్శకాల ప్రకారం ఆన్లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజీస్ ద్వారా అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ (కెమెస్ట్రీ, ఫిజిక్స్, బొటనీ), బీఎస్సీ(జువాలజీ, బొటనీ), బీఎస్సీ (మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్), బీఏ(పొలిటికల్ సైన్స్, హిస్టరీ), బీఏ(ఎకనామిక్స్, హిస్టరీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓఏఎండీసీ ఆన్లైన్ విధానంలో విద్యార్థులు నమోదుచేసుకుని వెబ్ ఆప్షన్లు ఎంచుకుని కేటాయించిన సీటును నిర్ధారించాలన్నారు. కళాశాలలో విశాలమైన, శుభ్రమైన, ప్రశాంతమైన క్యాంపస్ వాతావరణం, రూ.12 కోట్లు రూసా నిధులతో అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన పీహెచ్డి, నెట్, సెట్ అర్హతలు కలిగిన అధ్యాపకులు, ఆధునిక డిజిటల్ గ్రంథాలయం, ఈ లైబ్రరీ సదుపాయాలు, కంప్యూటర్ ల్యాబ్, వర్చువల్ క్లాస్ రూమ్, స్కిల్ హబ్ సెంటర్ ద్వారా గైడెన్స్, శిక్షణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం, స్కాలర్షిప్ లు, ఫీజు రియంబర్సుమెంట్, క్యాంపస్ ప్లేస్మెంట్లు, ఐసీటీ ఆధారిత బోధన వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9490402906, 7287010153, 7386075790, 9989903733 నెంబర్లను సంప్రదించాలన్నారు.

